వేకువ
# సమయం

సంపుటి: 14 సంచిక: 175

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy   సంపాదకులు : కె.భాస్కర్‌రావు   రూ.2.00/-   పేజీలు 8   తేది: బుధవారం 22 జూలై 2026







**సమయం ప్రతినిధి:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్‌పై పార్లమెంట్‌లో చర్చకు సంబంధించిన విషయంలో రాహుల్ మాట తప్పారంటూ మండిపడ్డారు. రాహుల్ మాట తప్పడం.. కొత్తగా రెండు డిమాండ్లు పెట్టడం సరికాదని అన్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం జితేంద్ర సింగ్ తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్‌తో కలిసి చర్చలు జరిపాం. నీట్‌పై పార్లమెంట్‌లో చర్చించాలని రాహుల్ డిమాండ్ చేశారు. చర్చకు సిద్ధమని ప్రభుత్వం ప్రకటించింది. మొదట అంగీకరించి రాహుల్ మాట తప్పారు. మళ్లీ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. కొత్తగా రెండు డిమాండ్లు పెట్టడం.. మాట తప్పడం సరికాదు' అని పేర్కొన్నారు. అంతకు ముందు.. ప్రధాని నరేంద్ర మోదీ ఇంటి దగ్గర ధర్నా చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దగ్గరకు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ వెళ్లారు. రాహుల్ గాంధీతో ఆయన చర్చలు జరిపారు. రాహుల్‌కు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ఆందోళన విరమించాలని కోరారు.




**ఢిల్లీ, సమయం ప్రతినిధి:** హర్యానా-పంజాబ్ సరిహద్దులోని శంభు బార్డర్ వద్ద హైటెన్షన్ నెలకొంది. మహాపంచాయత్‌లో పాల్గొనేందుకు పంజాబ్, హర్యానా నుంచి ఢిల్లీ వైపుగా వేలాది మంది రైతులు తరలివస్తున్నారు. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద నిరసన తెలిపేందుకు అన్నదాతలు వస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతిపాదిత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా తక్కువ ధరకు, సబ్సిడీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు నిరసనకు దిగుతున్నారు. అయితే, వారిని అడ్డుకునేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద మహాపంచాయత్‌కు 'దేశ్ బచావో మోర్చా' పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా సుమారు 550 రైతు సంఘాలు, సామాజిక సంస్థలు ఇందులో పాల్గొననున్నాయి. అయితే, నేడు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ఢిల్లీకి బయలుదేరుతున్నట్లు ప్రకటించింది. దీంతో శంభు సరిహద్దును పోలీసులు మూసివేశారు. రైతులను అడ్డుకునేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ అన్నదాతలను నిలువరించేందుకు చర్యలు చేపట్టారు. బారికేడ్లు, ఇనుప కంచెలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ పంజాబ్ నాయకుడు జర్మన్‌జిత్ సింగ్ బండాలా మాట్లాడారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం భారతీయ రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, విస్తృత ప్రజానీకంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు.




**సమయం ప్రతినిధి:** భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. నిన్న( సోమవారం) జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్నారు. గూండాగిరి,నిరంకుశత్వం వద్దంటూ.. అణచివేత చర్యలు నడవవంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రధాని మోదీ రాజీనామా చేయాలి: రాహుల్**

ధర్నా సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. నిన్న యువతపై లాఠీచార్జ్‌కు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చకు అంగీకరించలేదని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనం లేదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మౌనం వీడాలని, నీట్ అంశంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఎల్-నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కొందాం..
# రైతులు, ప్రజల రక్షణే ప్రభుత్వ లక్ష్యం: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్






**రంగారెడ్డి, జూలై 21 (సమయం ప్రతినిధి):** ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పనిచేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్షా సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, సంభావ్య వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి కంటింజెన్సీ ప్లాన్‌లను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, అవసరమైన విత్తనాల సరఫరా, తాగునీటి ఏర్పాట్లు, పశువులకు మేత, ఉపాధి హామీ పనులు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోటు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పెసర, కంది, జొన్న, రాగులు వంటి పంటలను ప్రోత్సహించాలని, రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను వెంటనే అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా జల వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని, అవసరమైన చోట కొత్త బోర్లు తవ్వించి తాగునీటి బోర్లకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలని తెలిపారు. పశుగ్రాసం కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు ప్రణాళికలు, సమన్వయంతో వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని స్పీకర్ పేర్కొన్నారు. ఎల్-నినో ప్రభావంతో ఏర్పడే అనావృష్టి పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించడం జిల్లా యంత్రాంగం బాధ్యత అని, అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలు, ఉద్యాన పంటలు, పండ్ల తోటలు, పూల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రాంతాల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులకు తగిన సూచనలు అందించాలని అధికారులను ఆదేశించారు.

2వ పేజీలో...




**(సమయం ప్రతినిధి):** మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ తమ్మినేని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కేసు దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని పేర్కొన్న న్యాయస్థానం.. ఈ దశలో జోక్యం చేసుకోవడం సరికాదని స్పష్టం చేసింది. అరెస్టు భయం ఉంటే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించింది. ఈ కేసుకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జులై 29కి వాయిదా వేసింది.

**కేసు వివరాలు**

నకిలీ పత్రాలను ఉపయోగించి సుమారు రూ.4 కోట్ల విలువైన భూమిని తన కుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలతో తమ్మినేనిపై కేసు నమోదైంది. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో కేసును రద్దు చేయాలని కోరుతూ తమ్మినేని హైకోర్టును ఆశ్రయించారు. అయితే కేసు ప్రాథమిక దశలో ఉన్నందున క్వాష్ చేయడానికి నిరాకరించిన హైకోర్టు.. చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించింది.

## ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దు: కవిత



**హైదరాబాద్,(సమయం ప్రతినిధి):** ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలంటూ కవిత రూపొందించిన నివేదికను ఆ కమిటీకి అందజేశారు. మంగళవారం ట్యాంక్ బండ సమీపంలోని అమరజ్యోతి కార్యాలయంలో ఉద్యమకారుల ఎంపిక కమిటీ సమావేశం అయింది. ఈ సమావేశంలో కవిత మాట్లాడుతూ.. స్వతంత్ర సైనిక సమ్మాన్, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ రూల్ పొజిషన్‌ను స్టడీ చేయాలని ఆ కమిటీకి సూచించారు. వాటిలో ఉన్న విధంగా ఉద్యమకారులకు ప్రయోజనం కలిగించాలని స్పష్టం చేశారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ఉంది.. అది తప్పని నిరూపించాలని ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారుల కోసం బీఆర్ఎస్‌లో అంతర్గతంగా పోరాటం చేసి బలైన వ్యక్తిని తానని గుర్తు చేసుకున్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఉద్యమకారులకు కొంత మేలు జరిగిన తన జన్మ ధన్యమైనట్లేనని టీఆర్ఎస్ చీఫ్ కవిత తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించటం, గౌరవించటం కోసం కమిటీ ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యమకారులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 1969 ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను కూడా ఇందులో చేర్చాలని గుర్తింపు కమిటీకి స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో జైల్లో ఉన్న వారు, ఎఫ్ఐఆర్‌లు, ఛార్జిషీట్లు నమోదైన వాళ్ల విషయంలో ఆలస్యం చేయకుండా గుర్తించాలని వివరించారు. వాళ్లందరీ విషయంలో కమిటీ మానవతా దృక్పథంతో ఆలోచించాలని కోరుతున్నానని చెప్పారు. ఉద్యమకారులు ఎవరైనా చనిపోతే మొదటి ప్రయారిటీ వాళ్ల భార్య, లేదంటే వాళ్ల పిల్లలు, తల్లిదండ్రులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏ స్కీమ్ పెట్టిన సరే స్కామ్ అవుతుందని.. ఈ నేపథ్యంలో అలా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని గుర్తింపు కమిటీకి కవిత సూచించారు. జార్ఖండ్‌లో ఉద్యమకారులకు వారి పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా అక్కడ పర్మినెంట్ కమిటీ ఉందని.. వీలు అయితే ఇక్కడ కూడా అలాంటిదే ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. గోవా, దాద్రా నగర్ హవేలి, బిహార్, యూపీ, మహారాష్ట్రల్లో ఉద్యమకారులకు పెన్షన్లు ఇస్తున్నారని వివరించారు. వాటిని అన్నింటిని స్టడీ చేస్తే సరిపోతుందని అన్నారు. రూల్ పొజిషన్, చట్టబద్ధత అంటూ సమయం వృథా చేయవద్దని గుర్తింపు కమిటీకి సూచించారు. ఈ సమావేశానికి జర్నలిస్టులు, డాక్టర్లు, న్యాయవాదులు తదితరులు హాజరయ్యారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది.

## వైభవంగా ఎల్లమ్మ తల్లి కల్యాణం..
# జోగినిలకు ప్రాముఖ్యం: మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్,(సమయం ప్రతినిధి):** బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. VIP దర్శనాలు, వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని vip గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగు తోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

**అమ్మవారి కృపాకటాక్షంతో వర్షాలు కురుస్తాయి: మంత్రి పొన్నం**

మహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో ఎన్నో విపత్తులు ఎదుర్కొన్నామని.. ఎన్‌లినోను కూడా ఎదుర్కొంటామన్నారు. అమ్మవారి కృపాకటాక్షంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు. సంవృద్ధిగా వర్షాలు పడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆషాఢమాస బోనాలు ఘనంగా జరిగేలా దేవాదాయ శాఖ తరఫున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్ని ఏర్పాట్లు చేసినా చిన్న చిన్న ఇబ్బందులు జరుగుతుంటాయని.. వాటిని అధిగమించి అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకోవాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర మీద ఉండాలని, సుఖశాంతులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# సంపాదకీయం

## వాంగ్‌చుక్... ఆ గళాలన్నీ గప్‌చుప్!

ఆ ఇరువురూ ధర్మ యోధులు. పాలనావ్యవస్థలో అవినీతికి, అసమర్థతకు వ్యతిరేకంగా ప్రాణత్యాగానికి సాహసించి నిరవధిక నిరాహార దీక్షలతో ప్రభుత్వాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీరులు. వారి ధర్మ పోరాటాల మధ్య కాల విరామం పదిహేను సంవత్సరాలు మాత్రమే. వాటి కథలు భిన్నమైనవి. దేశ రాజకీయాలలో, ప్రజా దృక్పథాల్లో ఒక స్పష్టమైన మార్పును అవి సూచిస్తున్నాయి. ఆ నైతిక యోధులలో ఒకరు అన్నా హజారే. 1990ల్లో మహారాష్ట్రలో సమాచార హక్కు చట్టం కోసం, అవినీతిపరులైన అధికారులపై చర్యలను డిమాండ్ చేస్తూ ఆయన అనేక ఆందోళనలు, నిరాహార దీక్షలు నిర్వహించారు. వాటికి పరాకాష్ఠ జన్‌లోక్‌పాల్ ఉద్యమం. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని అరికట్టేందుకు లోక్‌పాల్ వ్యవస్థను నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5, 2011న ఆయన నిరాహారదీక్షకు ఉపక్రమించారు. నాలుగు రోజుల పాటు సాగిన ఆ పోరాట దీక్ష, జన్ లోక్‌పాల్ బిల్లు ముసాయిదా రూపకల్పనకు ఒక సంయుక్త సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో ముగిసింది. తిరిగి అదే ఏడాది ఆగస్టు 16న న్యూఢిల్లీలోని సుప్రసిద్ధ రామ్‌లీలా మైదానంలో అన్నా మళ్లీ నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఆయన డిమాండ్లకు అనుకూలంగా పార్లమెంటు ఒక తీర్మానాన్ని ఆమోదించడంతో అన్నా దీక్ష పన్నెండవ రోజున (ఆగస్టు 28) ముగిసింది. లోక్‌పాల్ కోసం నిర్వహించిన దీక్షలతో ఆయన ఆసేతు హిమాచలం ఆబాలగోపాలానికి సుపరిచితుడు అయ్యారు.అన్నా హజారే డిమాండ్ సాపేక్షంగా నిరపాయకరమైనది. అవినీతిని నిర్మూలించేందుకు గట్టిచర్యలు చేపట్టేందుకు జాతీయస్థాయిలో స్వతంత్ర లోక్‌పాల్ వ్యవస్థను సృష్టించాలనేది ఆయన డిమాండ్. అవినీతి అనేది చాలామంది పాల్పడుతున్నదే కదా అనే ఉదాసీనత దేశంలో అవినీతి పెచ్చరిల్లిపోయేందుకు దారితీస్తోంది. అందరూ చట్టోల్లంఘనకు పాల్పడుతున్నప్పుడు తాను ఒక్కణ్ణే చట్టానికి కట్టుబడి ఉండడం వల్ల ప్రయోజనమేముంది అన్న ఆలోచనతో అత్యధికులు అవినీతికి కారకులవుతున్నారు. పైగా, అన్నాహజారే నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్న సందర్భంలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం అనేక కుంభకోణాలతో అప్రతిష్ఠ పాలయివున్నది. ప్రభుత్వ ప్రమేయమున్న ప్రతి వ్యవహారంలోను అవినీతి చోటుచేసుకున్నదని ప్రజలు విశ్వసించిన కాలమది. దీంతో, అన్నా ఆందోళనకు అశేష ప్రజల మద్దతు లభించింది. రామ్‌లీలా మైదానంలో అన్నా హజారే నిరాహార దీక్షకు మద్దతు తెలిపేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలి రావడాన్ని టెలివిజన్ చానెల్స్ ప్రత్యక్ష ప్రసారం చేశాయి. వృత్తి విధులను నైతిక నిష్ఠతో నిర్వహించిన విశ్రాంత ఐపీఎస్ అధికారి కిరణ్ బేడీ లాంటి వారే కాకుండా యోగా గురువు బాబా రామ్‌దేవ్ లాంటివారు కూడా అన్నా ఉద్యమానికి సంపూర్ణ మద్దతునిచ్చారు. అవినీతిని తాము ఎంత చిత్తశుద్ధితో వ్యతిరేకిస్తుందీ చాటుకోవడానికి అన్నా ఉద్యమానికి మద్దతునివ్వడం ఒక ప్రయోజనకరమైన మార్గమని అనేకానేకమంది విశ్వసించారు. అయితే, అన్నా ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన అసలు శక్తి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్. దేశవ్యాప్తంగా శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్న ఈ సంస్థ తన అసంఖ్యాక కార్యకర్తలను అన్నా ఉద్యమాగ్నులు మరింతగా ప్రజ్వరిల్లేలా చేసేందుకు నియోగించింది. నర్మదా సాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించిన మేధా పాట్కర్; సోషలిస్టు మేధావి యోగంద్ర యాదవ్, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మొదలైనవారు కూడా హజారే ఉద్యమానికి సంపూర్ణ మద్దతునిచ్చారు. అయితే ఆ ఉద్యమ అంతిమ విజేత మట్టుకు భారతీయ జనతా పార్టీ. 2014 సార్వత్రక ఎన్నికల ఫలితాలే అందుకు తిరుగులేని నిదర్శనం. అన్నా ఉద్యమ ఉధృతిలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికీ ఒక పాత్ర ఉన్నది. ఉద్యమ జటిలతను మన్మోహన్ సర్కార్ తొలుత అర్థం చేసుకోలేదు. ఆ క్లిష్ట పరిస్థితి అర్థంకాగానే అన్నాతో 'సంప్రదింపులు' జరిపేందుకు కేబినెట్ మంత్రులు ప్రణబ్ ముఖర్జీ, ఏకే ఆంటోనీలతో పాటు మరో ఇద్దరు ప్రముఖుల సహాయాన్ని యూపీఏ ప్రభుత్వం తీసుకుంది. ఒకరు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విలాసరావు దేశ్‌ముఖ్, మరొకరు 'నాబార్డ్' మాజీ చీఫ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర సారంగి. హజారేతో చర్చలు సఫలమయేందుకు ఈ ఇరువురూ విశేషంగా తోడ్పడ్డారు. ప్చ్, ప్రయోజనమేముంది? అప్పటికే యూపీఏ సర్కార్ చేతుల్లోంచి కాలం జారిపోయింది. అరేబియా జానపద గాథలో వలే సీసా నుంచి భూతం బయటపడింది, మళ్లీ దాన్ని సీసాలో బంధించడం అసాధ్యమైపోయింది. పర్యావరణ పరిరక్షణ యోధుడు, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష అన్నాహజారే ఆందోళనకు పూర్తి భిన్నమైనది. ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది–వాంగ్‌చుక్ డిమాండ్ నిర్దిష్ట వాస్తవికత ఆధారంగా చేసింది. జాతీయస్థాయి ప్రవేశపరీక్షలో అవకతవకలతో కోట్లాది విద్యార్థినీ విద్యార్థులు లోనైన కష్టనష్టాలకు నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది కాక్రోచ్ జనతాపార్టీ డిమాండ్. దీనితో పోల్చితే అన్నా డిమాండ్ సైద్ధాంతికమైనది, సంకీర్ణమైనది. అన్నా, వాంగ్‌చుక్ డిమాండ్ల మధ్య వ్యత్యాసం ఆ ఇరువురి రాజకీయ చతురత మధ్య తారతమ్యతకు అద్దం పడుతుంది. హజారేకు ఉన్నత స్థాయిలో రాజకీయ సంబంధాలు ఉన్నాయి. ఆయనను ప్రభావితం చేయడమూ సులువైన విషయమే. అన్నాతో పోలిస్తే వాంగ్‌చుక్ దృఢ విశ్వాసాలు ఉన్న పోరాటకారుడు. ఆయన ఒకసారి ఒక నిర్ణయానికి వస్తే మరెవ్వరూ ఆయన్ని అందుకు విరుద్ధంగా వ్యవహరించేలా ప్రభావితం చేయలేరు. తన నిర్ణయం నెగ్గేంతవరకు పట్టుదలతో ఉండే యోధుడు ఆ హిమాలయ భారతీయుడు. అన్నా డిమాండ్‌ను నెరవేర్చితే ముంచుకొచ్చే ముప్పు ఏమీలేదు. ఎందుకంటే ఆ డిమాండ్ అంతిమంగా నిరుపయోగకరమైనది. వాంగ్‌చుక్ పోరాట లక్ష్యం కంటే అన్నా ఉద్యమ ఆశయాన్ని నెరవేర్చడం సులభం.రెండోది–వాంగ్‌చుక్‌కు ప్రతిపక్షాల మద్దతు లేకపోవడం. అన్నా ఆందోళన సందర్భంలో ఆనాటి ప్రతిపక్షం బీజేపీ ఆ ఉద్యమాన్ని తన రాజకీయ ప్రయోజనాల పురోగతికి ఒక అపూర్వ అవకాశంగా పరిగణించింది. మన్మోహన్ సర్కార్ పాలనలోని అవినీతిని ఎండగట్టేందుకు ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్నది. వాంగ్‌చుక్ పోరు సందర్భంలో ప్రస్తుత ప్రతిపక్షం ఏమి చేస్తున్నది? స్తబ్ధుగా ఉండిపోవడమే కాదూ? ఈ మందకొడితనానికి కారణమేమిటి? ప్రతిపక్షాలు వేటికవిగా ఉండిపోవడమే. ఈ అనైక్యత వల్లే మోదీ సర్కార్‌ను సవాల్ చేసేందుకు వాటికొక సమైక్య, సుసంగత వ్యూహం లేకుండాపోయింది. వాంగ్‌చుక్ ఉద్యమ మనోరథం నెరవేరితే తమకు సమకూరే ప్రత్యక్ష ప్రయోజనమేదీ లేదని విపక్షాలు భావిస్తున్నాయి. అన్నా ఉద్యమం ప్రత్యక్ష లబ్ధిదారు బీజేపీ. అందుకే అది ఆనాడు ఆ ఆందోళనను అన్ని విధాలా ఎగదోసింది, లబ్ధి పొందింది. అన్నా హజారే బీజేపీ చేతుల్లో కీలుబొమ్మ. వాంగ్‌చుక్ అలా కాదు, ఆయన ఒంటరి యోధుడు. హజారే ఆందోళనలో సమస్త భారతీయులూ అవినీతికి వ్యతిరేకంగా ముక్తకంఠంతో ఘోషించారు.. అవినీతి పాలకులను అధికారం నుంచి తొలగించేందుకు సమైక్యమయ్యారు.

# మహబూబ్‌నగర్ న్యూ మోతీనగర్‌లో నూతన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి






- సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంతో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ భేటీ

(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్) : మహబూబ్‌నగర్ పట్టణంలోని న్యూ మోతీనగర్, సద్దులగుండు ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కోరారు.న్యూ మోతీనగర్‌లో 10 వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారని, అక్కడి నుంచి సద్దులగుండు, రాజేంద్రనగర్, ప్రేమ్‌నగర్ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజలు ఇప్పటికీ రైల్వే ట్రాక్ దాటాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ కారణంగా అనేక మంది ప్రమాదాలకు గురై కాళ్ళు , చేతులు అవయవాలు కోల్పోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయని, అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌ల రాకపోకలు కూడా తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నాయని వివరించారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా న్యూ మోతీనగర్ వద్ద అత్యవసరంగా నూతన రైల్వే అండర్ బ్రిడ్జి (RUB) నిర్మించాలని కోరారు.అదేవిధంగా న్యూ మోతీనగర్ నుంచి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (FCI) గోదాం వరకు శాశ్వత రహదారి నిర్మాణానికి రైల్వే శాఖ అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే అనుమతి లభించిన వెంటనే మున్సిపాలిటీ ద్వారా లేదా స్వంతంగా గానీ రహదారిని ఏర్పాటు చేసుకుంటామని అన్నారు.న్యూ మోతీనగర్ బ్రిడ్జి వద్ద డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే నీటి నిల్వ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టాలని కోరారు. మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ వినతిపై సానుకూలంగా స్పందించిన సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు మరియు సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేటర్లు మధుమోహన్, 41వ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీ నరేష్, మాజీ కౌన్సిలర్ గంజి వెంకన్న, మాజీ రైతుబంధు అధ్యక్షులు గోనెల రాములు, పడాల శేఖర్, గోపి, రవికుమార్, సిద్ధు తదితరులు ఉన్నారు.

# ఎల్-నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కొందాం..
# రైతులు, ప్రజల రక్షణే ప్రభుత్వ లక్ష్యం: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

మొదటి పేజీ తరువాయి

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. తాగునీటి కొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయాలని, గ్రామాలు, పట్టణాల్లో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు తమ కార్యాచరణ ప్రణాళికలను వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్లు సవ్యసాచి ఘోష్, వికాస్ రాజ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, వీర్లపల్లి శంకర్, మనోహర్ రెడ్డి, హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, మేడ్చల్––మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్సీ దయానంద్, జిల్లా అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి, డీఆర్‌ఓ శారద, మున్సిపల్ చైర్మన్లు, ఆర్డీఓలు, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, భూగర్భ జలాలు, నీటిపారుదల తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి నష్టం జరగనివ్వబోం: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ: నీట్ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ లీక్ కారకులకు శిక్షపడేలా చర్యలు తీసుకున్నామని, నిందితులను జైల్లో పెట్టామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. విద్యార్థులకు నష్టం కలగకుండా రీనీట్ నిర్వహించామని తెలిపారు. ఈరోజు(మంగళవారం) ఢిల్లీలో ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ 'మంగళ్ మిలన్' సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ప్రధాని మోదీ మాట్లాడారు. నీట్ పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఈ సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. ఈ భేటీలో ప్రధాని మోదీతో చర్చించిన విషయాలను మీడియాకు వెల్లడించారు. నీట్ పేపర్ లీక్ అంశం వెలుగులోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే 13 మందిని అరెస్టు చేసి జైలుకు పంపించినట్లు చెప్పుకొచ్చారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీట్ పున:పరీక్ష నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చామని, ఈ ఫలితాలను కూడా ఆలస్యం లేకుండా ప్రకటించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠిన చర్యలు అవసరమని ప్రధాని మోదీ సూచించారని కిరణ్ రిజిజు వెల్లడించారు. పేపర్ లీక్‌లను పూర్తిగా అణచివేయడానికి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా దేశంలోని ప్రముఖ న్యాయవాదులను నియమించాలని ప్రధాని సూచించారని తెలిపారు. అదేవిధంగా ఎన్డీఏ సమావేశంలో దేశ ఆర్థిక పురోగతి, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (FTA\T), ప్రభుత్వ విజయాలపై కూడా ప్రధాని సమీక్షించారని తెలిపారు. వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాల్లో రైతుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రధాని హామీ ఇచ్చారని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మాత్రమే ప్రతి ఒప్పందాన్ని రూపొందిస్తున్నామని, వారి ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ప్రధాని మోదీ స్పష్టం చేశారని కిరణ్ రిజిజు పేర్కొన్నారు.

# సంగారెడ్డి: పాత పెన్షన్ విధానం అమలు చేయాలి: TPUS




సమయం ప్రతినిధి : ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తెలంగాణ ప్రాంతం ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నూతన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగుల జనజాగరణ యాత్రకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

# ముందుకు సాగని ఎస్ ఐఆర్

హైదరాబాద్ : హైదరాబాద్ SmF ప్రక్రియ సజావుగా నడవటం లేదు. బీఎల్‌ఓలు ఎన్యుమరేషన్ ఫారంలను పంపిణీ చేసి తిరిగి ఇవ్వాలని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. హైదరాబాద్ లో మాత్రం బీఎల్‌ఓలు SmF ప్రక్రియలో చురుగ్గా పాల్గొనడం లేదు. హైదరాబాద్ నగరం పరిధి ఎక్కువ కావడం, అపార్ట్ మెంట్లు ఎక్కువగా ఉండటంతో వాచ్ మెన్ కు ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చి వెళ్లిపోయే వారి సంఖ్య ఎక్కువగా కనపడుతుంది. ఎన్యుమరేషన్ ఫారాలు నింపడానికి అవసరమైన సలహాలు, సూచనలు కూడా చేయకపోవడంతో బీఎల్‌ఓలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటి వరకూ ఇరవై శాతం మాత్రమే ఎన్యుమరేషన్ జరిగిందని చెబుతున్నారు. బీఎల్‌ఓలు పెద్దగా పట్టించుకోకపోవడంతోనే SmF ప్రక్రియ సజావుగా నడవడం లేదు. పైగా బీఎల్‌ఓలు ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేయడంలో సహకరించాల్సింది పోయి అసలు పట్టీపట్టన్నట్లు వ్యవహరించడంతోనే ఈ ప్రక్రియ సజావుగా జరగడం లేదు. అనేక మంది తమకు ఓట్లు ఉన్నా లేకపోయినా పరవాలేదు అనుకునే దశకు చేరుకున్నారు. బీఎల్‌ఓలు నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని అంటున్నారు. .. దీనికి బీఎల్‌ఓలను ప్రశ్నిస్తే తాము వచ్చి ఫారాలు నింపేందుకు సహకరించలేమని, తమకు మంచినీళ్లు కూడా ఇవ్వడం లేదని ఎదురుదాడికి దిగుతున్నారు. అనేక ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. హైదరాబాద్ లో అపార్ట్ మెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటన్నింటికీ ఎక్కి దిగాలంటే కష్టమే. కానీ తమకు మంచి నీళ్లు ఇవ్వలేదని, టీ అడగలేదంటూ కుంటిసాకులు చెబుతూ SmF ప్రక్రియ ను నీరుగార్చడమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది.

# గ్యాప్ కంటిన్యూస్..

మెదక్ : బీఆర్‌ఎస్ పార్టీలో హరీష్ రావు వర్సెస్ కేటీఆర్ పంచాయితీ నడుస్తుంది అన్న గుసగుసలు, లీకులు కొత్తేమీ కాకపోయినా, తాజాగా రంగనాయక్ సాగర్ వద్ద జరిగిన హరీష్ రావు పాదయాత్ర మరోసారి ఆ ఆరోపణలకు బలం చేకూర్చినట్లైంది.కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టులు నింపాలని, కరువులో రైతన్నలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అన్నపూర్ణ సాగర్ నుండి రంగనాయక సాగర్ వరకు మాజీ మంత్రి హరీష్ రావు పాదయాత్ర చేశారు. హరీష్ రావు పాదయాత్రకు ఏర్పాట్లు కూడా భారీగానే జరిగాయి. భారీ ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలతో హరీష్ పాదయాత్ర సాగింది. అయితే, వాటిలో ఎక్కడా కేటీఆర్ ఫోటో లేదు. భారీ సైజులో హరీష్ రావు, చిన్నగా కేసీఆర్ ఫోటోతో మాత్రమే కనపడ్డాయి. దీంతో ఎంత సిద్ధిపేట కేంద్రంగా పాదయాత్ర చేసినా? పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ ఫోటో వేయటం కనీసం ప్రోటోకాల్. బాధ్యత. కానీ, కేటీఆర్ ఫోటోను ఎందుకు పక్కనపెట్టినట్లు? కావాలనే ఇలా చేశారన్న అభిప్రాయం వినపడుతోంది.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి చర్యలు తీసుకోవాలి





**సుప్రీంకోర్టు ఆదేశాల అమలుపై**
**రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ సమీక్ష**
**సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి జూలై 21 : రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం, జాతీయ రహదారులపై భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయడం, సుప్రీంకోర్టు జారీ చేసిన కీలక ఆదేశాలను ప్రతి జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా రాష్ట్ర రోడ్లు, రవాణా మరియు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లాల కలెక్టర్లు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్లు (ఎస్పీలు), రవాణా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు.సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, దేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు సూచించిన మార్గదర్శకాలను ప్రతి జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా గతంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాల వివరాలను, ప్రమాదాలకు ప్రధాన కారణాలను, అధిక ప్రమాద ప్రాంతాలు జరుగుతున్న ప్రాంతాల (బ్లాక్ స్పాట్స్) పైన సమీక్షించారు. ప్రమాదాలు ఎక్కువగా ఎక్కడ, ఏ కారణాలతో జరుగుతున్నాయనే అంశాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పనిచేస్తున్న జిల్లా రోడ్డు భద్రత కమిటీ మరింత పటిష్టంగా పనిచేసేలా చూడాలని, ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేపట్టాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రమాదాలకు కారణమవుతున్న లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని, రోడ్ల మరమ్మతులు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, డివైడర్లు, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ వంటి భద్రతా చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ,....... రాష్ట్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు సూచించిన అన్ని మార్గదర్శకాలను జిల్లాలో కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లా అధికారులతో పాటు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి, జిల్లాలోని జాతీయ రహదారుల పరిస్థితి, ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలు, హైవేలపై ఉన్న ధాబాలు, హోటళ్ల అనుమతులు, రహదారి భద్రతా ప్రమాణాలు, సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, అంబులెన్స్ సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ ప్రతినెలా సమీక్ష సమావేశం నిర్వహించి, క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు కూడా ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతకు సంబంధించిన సుప్రీంకోర్టు ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించి, ప్రతి ప్రయాణికుడికి సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఈ వీడియో కాన్ఫరెన్స్‌లోఅదనపు కలెక్టర్ రెవిన్యూ చెన్నయ్య, ఆర్టీవో ఇమ్రాన్ అహ్మద్, ఇతర రవాణా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 78 మండలాల్లో కరువు జాడలు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు లేక రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. తెలంగాణలోనూ వానలు కురియడం లేదు. అనేక మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. తాగు, సాగు నీటికి కూడా ఇబ్బందికరంగా మారింది. వానలు లేకపోవడంతో ప్రాజెక్టుల్లో నీరు లేదు. తెలంగాణ ఎక్కువగా భూగర్భ జలాల పై ఆధారపడి సేద్యం సాగుతుంది. కానీ విపరీతమైన ఎండల కారణంగా చాలా బోర్లు ఎండిపోయాయి. అనేక మండాలలను కరువు పరిస్థితులు ప్రకటించడానికి ప్రభుత్వం సిద్ధమయింది. ఎల్ నినో ప్రభావం తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తుంది.మరొకవైపు జులై నెలలో చల్లదనాన్ని నిండుకుని ఉండే తెలంగాణ నేటికీ వేసవి కాలాన్ని తలపిస్తుంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా మేరకు ఈరోజు వానలు అక్కడకక్కడ పడతాయని, తేలికపాటి వానలు మాత్రమే పడతాయని చెప్పింది. ఈ కరువు నుంచి బయటపడాలంటే కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిందే.ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి రెండు నెలలు గడుస్తున్నా, రాష్ట్రంలోని 78 మండలాల్లో చుక్క వర్షం కూడా పడలేదు. చెరువులు పూర్తిగా ఎండిపోయి, పంట పొలాలు కష్టాల్లో ఉన్నాయి. వాతావరణ శాఖ తెలిపిన సమాచారం ప్రకారం, రాష్ట్రంలో సగటున 24 రోజులే వర్షాలు కురిసినట్లు తెలుస్తోంది. పలు జిల్లాల్లో పది రోజులు కూడా వర్షం కురవలేదని అధికారులు పేర్కొన్నారు. నేలలో తేమ ఆరిపోయి, నాటిన విత్తనాలు మాడిపోతున్నాయి. కొన్ని మొలకెత్తినప్పటికీ, అవి వాడిపోయి నేలవాలుతున్నాయి. ఈ పరిస్థితి రైతుల ఆశలను మరింతగా దెబ్బతీస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా 462 మండలాల్లో లోటు వర్షపాతం నమోదవుతోంది. ములుగు జిల్లాలో మాత్రమే వర్షపాతం సాధారణ స్థాయిని మించి ఉంది. ములుగు జిల్లాలో 343.2 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా, 350 మిల్లీ మీటర్ల వర్షం పడింది. కానీ, మిగతా జిల్లాల్లో 33 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుండి జులై 19 వరకు సాధారణంగా 254.3 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉంది, కానీ కేవలం 170.7 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసాయి. గత సంవత్సరం ఇదే కాలంలో 204.3 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది, అయితే ఈసారి పరిస్థితి మరింత కష్టంగా ఉంది.సాధారణంగా జులైలో నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల ఎక్కువ వర్షాలు కురుస్తుంటాయి. కానీ ఈసారి 53 శాతం లోటు వర్షపాతం నమోదవుతోంది. జూన్ నుండి సెప్టెంబర్ వరకు సాధారణంగా 740.6 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉంది, కానీ ఇప్పటి వరకు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. జూన్‌లో 130.3 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 115.3 మిల్లీ మాత్రమే కురిసింది. జులైలో 227.4 మిల్లీ వర్షం పడాల్సి ఉంది, కానీ 61.5 మిల్లీ మాత్రమే కురిసింది. ఈ పరిస్థితి రైతుల సాగుకు తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలంలో గోదావరి నది కూడా వెలవెలబోతుంది. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడుతున్న కరవు పరిస్థితుల వల్ల దాదాపు 2 వేల ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. వాజేడు, ఏటూరునాగారం, మంగంపేట, వెంకటాపురం మండలాల్లో రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

## స్టార్ట్ ప్ టూ... స్కై హై...

హైదరాబాద్ : శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుండి జూలై 18, శనివారం, మధ్యాహ్నం 12:05 ఎంకి విక్రమ్-1 ప్రయోగం ప్రారంభమైంది. 17 నిమిషాల తర్వాత, ఇది తన పేగులకు సంబంధించిన ఉపకరణాలను విజయవంతంగా విడుదల చేసింది. ఈ ఘనతకు 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్‌లో సంబరాలు గట్టిగా జరిగాయి. ఈ తొలి ప్రయోగం, 'ఆగమన్' అని పిలువబడింది, భారతదేశాన్ని ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యం కలిగిన మూడవ దేశంగా నిలిపింది. అయితే, తెలంగాణకు ఇది ఒక దశాబ్ద కాలం పాటు ఆవిష్కరణ వ్యవస్థను నిర్మించడానికి పెట్టిన పెట్టుబడికి ఫలితం. ఈ ప్రయాణం 2015 నవంబరులో ప్రారంభమైంది, అప్పటి ఐటీ మరియు పరిశ్రమల మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో టీ హబ్ ప్రారంభమైంది, ఇది అప్పటివరకు భారతదేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇన్క్యుబేటర్. ప్రారంభోత్సవంలో, రతన్ టాటా దీనిని 'భారతదేశానికి కొత్త ముఖం' అని పేర్కొన్నారు. ఈ చుట్టూ, రాష్ట్రం విస్తృతమైన నెట్‌వర్క్‌ను నిర్మించింది – ప్రోటోటైపింగ్ కోసం టీ వర్క్స్, మహిళా వ్యాపారులకు, నైపుణ్యాలు, పరిశోధన మరియు అకాడమియా-ఇండస్ట్రీ సంబంధాల కోసం టాస్క్, రిచ్ తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ సెల్. స్కైరూట్ ఎయిరోస్పేస్ ఈ వ్యవస్థలో జన్మించింది. 2018లో, మాజీ ఇస్రో శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన మరియు నాగ భరత్ డాకా స్థాపించిన ఈ కంపెనీ, ౧-ఊబీఎలో ప్రారంభ సంవత్సరాలలో ఇన్క్యుబేట్ చేయబడింది, మెంటార్షిప్, పెట్టుబడిదారుల ప్రాప్తి మరియు వ్యాపార మద్దతు పొందింది. ఇది డ్రాయింగ్‌ల నుండి హార్డ్‌వేర్‌కు మారుతున్నప్పుడు, తన ఇంజనీర్లకు ప్రోటోటైపింగ్ సౌకర్యాలను అందించింది, దీని ద్వారా భాగాలను డిజైన్ చేయడం, పరీక్షించడం మరియు మెరుగుపరచడం జరిగింది. దీని వల్ల సాధించిన ఫలితాలు త్వరగా వచ్చాయి. 2022 నవంబరులో, స్కైరూట్ యొక్క ఉపఆర్బిటల్ విక్రమ్-S, ఇస్రో యొక్క సౌకర్యాల నుండి రాకెట్‌ను ప్రయోగించిన తొలి భారతీయ ప్రైవేట్ కంపెనీగా నిలిచింది. టీ హబ్ లో జరిగిన ఒక వేడుకలో, కేటీఆర్ దీనిని భారతదేశం యొక్క అంతరిక్ష సాంకేతిక పరిశ్రమకు 'నిజంగా చరిత్రాత్మక క్షణం' అని పేర్కొన్నాడు. 'ఇది హైదరాబాద్ నుండి మరింత మంచిగా జరగలేదు' అని చెప్పాడు మరియు రాష్ట్రంలో దేశంలోని తొలి సమగ్ర రాకెట్ డిజైన్, తయారీ మరియు పరీక్షా సౌకర్యం కోసం ప్రోత్సహించాడు. 'వారు తమ రాకెట్లను ఇతర ప్రాంతాలకు పంపకూడదు' అని ఆయన అన్నారు. 2025 నవంబరులో, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, హైదరాబాద్‌లోని స్కైరూట్ యొక్క ఇన్ఫినిటీ క్యాంపస్‌లో ఫ్లైట్-రెడీ విక్రమ్-1ను ఆవిష్కరించారు. 2026 మే నాటికి, ఈ కంపెనీ భారతదేశంలోనే తొలి స్పేస్ టెక్ యూనికార్న్‌గా మారింది. రెండు నెలల తర్వాత, ఇది ఉపగ్రహాలను ఆకాశంలోకి పంపించింది. విక్రమ్-1, సుమారు 20 మీటర్ల ఎత్తు, 350 కిలోల బరువున్న చిన్న ఉపగ్రహాలను తక్కువ భూమి కక్ష్యలోకి తీసుకెళ్లగలదు – ఇది హైదరాబాద్‌ను ప్రపంచ చిన్న ఉపగ్రహాల మ్యాప్‌లో బలంగా నిలబెట్టింది మరియు నగరానికి కొత్త రకం ప్రొపల్షన్, ఉపగ్రహ మరియు ఎయిరోస్పేస్-మటీరియల్స్ స్టార్టప్‌లను ఆకర్షించింది. భారతదేశానికి, ఇది ప్రైవేట్ స్పేస్‌ఫ్లైట్‌లో ఒక దూకుడు. తెలంగాణకు, ఇది చివరకు ప్రారంభానికి క్లియర్ అయిన దృష్టి.

# జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు వేగవంతం చేయాలి



మహబూబ్‌నగర్, జూలై 21 (సమయం ప్రతినిధి): జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతా చర్యల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డి. జానకి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. రాష్ట్ర రవాణా, రోడ్లు ఉ భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల అమలు, వివిధ శాఖల బాధ్యతలు, సమన్వయ చర్యలపై జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ, జాతీయ రహదారులపై అనధికారికంగా భారీ వాహనాలు నిలిపివేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు నిలిపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రహదారులపై ఆక్రమణలను తొలగించడం, అక్రమ నిర్మాణాలను అరికట్టడం, క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం, ప్రజల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను బలోపేతం చేయడం, డ్రోన్ సర్వేల ద్వారా ఆక్రమణలను గుర్తించడం వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా స్థాయిలో హైవే భద్రతా టాస్క్‌ఫోర్స్‌ను సమర్థవంతంగా పనిచేయించేలా చర్యలు తీసుకోవాలని, పోలీసు, రవాణా శాఖ, జాతీయ రహదారుల సంస్థతో పాటు సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని మరింత పెంచాలని సూచించారు. జాతీయ రహదారులపై నిఘా, పహారా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు అత్యవసర వైద్య సేవలు, రికవరీ వాహనాలు, ట్రక్ లే-బై సౌకర్యాలు, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, తగిన లైటింగ్, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు వంటి రహదారి భద్రతా చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే సుప్రీంకోర్టు ఆదేశాలను నిర్దేశిత గడువులోగా పూర్తిస్థాయిలో అమలు చేసి, శాఖలవారీగా అనుసరణ నివేదికలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

# సీజెపి కార్యకర్తల లాఠీచార్జిపై సిపిఐ ఆగ్రహం.. నిరసన

వనపర్తి, సమయం ప్రతినిధి : ఢిల్లీలో చలో పార్లమెంట్ చేపట్టిన సిజెపి కార్యకర్తలపై పోలీసుల లాఠీచార్జిని నిరసిస్తూ సిపిఐ వనపర్తిపట్టణ కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి అంబేద్కర్ చౌక్లో ధర్నా చేసి తీవ్ర నిరసన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. పటిష్ట విద్యా విధానం కోసం పోరాడుతున్న సీజెపి కార్యకర్తలపై పోలీసుల నాటి చార్జి అమానుషమన్నారు. దాడిని ఖండించారు. బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం న్యాయమైన వారి డిమాండ్లకు సమాధానం చెప్పలేక కక్షపూరితంగా పోలీసులను ఉసిగొలిపి లాఠీ చార్జి చేయించడం, ఇయర్ గ్యాస్ ప్రయోగించడం, రబ్బర్ బుల్లెట్లు వాడటం, కరుడుగట్టిన నేరస్తులను కొట్టినట్లు తలలు పగలగొట్టడం దారుణమన్నారు. బిజెపి ప్రభుత్వంలో దిగజారుతున్న విద్యా విధానం సరిదిద్దాలని, పోటీ పరీక్షల పేపర్ లీకేజీలను అరికట్టాలని ఆందోళన చేయటం న్యాయ సమ్మతం అన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉందన్నారు. పేపర్ల లీకేజీని అరికట్టలేని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ సరైందన్నారు. నీటు రద్దు కారణంగా 23 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని వారికి కోటి రూపాయలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేయటం తప్పేలా అవుతుందన్నారు. విద్య, పరీక్షల వ్యవస్థను గాడిలో పెట్టాలని పోరాడుతున్న 70 మంది పై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ధర్మేంద్ర ప్రధాని వెంటనే రాజీనామా చేయాలని, చనిపోయిన విద్యార్థులకు కోర్టు పరిహారం ఇవ్వాలని, 70 మంది పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ దేశంలో యువత




విద్యార్థి వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నారు మానుకో పోతే సిపిఐ ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టి కేంద్రం మెడలు వంచుతామన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్, పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, డిహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్,చీఖీ×ఔ జిల్లా సహాయ కార్యదర్శి జయమ్మ, పట్టణ కో కన్వీనర్ శిరీష, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వి నాదం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కుర్మయ్య, రమణ, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కన్వీనర్ వంశీ, నేతలు గంధం నాగరాజు, బాలిమియా,విష్ణు, చందు, ప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ భూముల్లో తండావాసుల వ్యవసాయం

గుంటూరు : అటవీ శాఖకు చెందిన భూములను కొందరు ఆక్రమించి, ఆ స్థలాల్లో బోర్లు వేశారు. వ్యవసాయానికి అనుకూలంగా ఉండటంతో పంటలు కూడా పండిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని బోర్లను పూడ్చేశారు. విషయం తెలుసుకున్న తండా వాసులు అక్కడికి చేరుకుని సిబ్బందిని నిర్బంధించి, వారి వాహనాల టైర్లలో గాలి తీసేశారు. అటవీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన మాచర్ల పరిధిలో చోటుచేసుకుంది.అటవీ చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. అటవీ భూములను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉండటంతో అవి అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు అధికారులు కూడా అదే స్థాయిలో పనిచేస్తుంటారు. అయితే, కొందరు అటవీ శాఖ భూముల్లో బోర్లు వేసి వాటిని ఆక్రమించే ప్రయత్నం చేయగా.. విషయం తెలుసుకున్న అధికారులు వాటిని పూడ్చేందుకు వెళ్లారు. అది తెలుసుకున్న తండా వాసులు బైక్‌లపై గ్యాంగ్‌ల వచ్చి అటవీశాఖ అధికారులపైనే దాడికి దిగారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా మాచర్లలో చోటుచేసుకుంది.అటవీశాఖ రేంజర్ విజయలక్ష్మి కథనం మేరకు.. మారచర్ల మండలం కండ్లకుంట బీట్ పరిధిలోని రేగులవరం తండాకు చెందిన కొందరు అటవీ భూమిలో బోరు వేసి, పంటలు పండిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు రావడంతో మూడు వాహనాల్లో రేంజర్ విజయలక్ష్మితో పాటు 12 మంది సిబ్బంది తండాకు వెళ్లారు. రవి నాయక్ అనే వ్యక్తి అనుమతులు లేకుండా బోరు తవ్వినట్లు గుర్తించి, అధికారులు పూడ్చేశారు.అయితే, ఆ ప్రదేశంలో ఇంకా బోర్లు వేశారన్న సమాచారంతో మరో చోట పరిశీలించేందుక అధికారులు బయల్దేరారు. అదే సమయంలో తండాకు చెందిన కొందరు బైకులపై వచ్చి అటవీశాఖ సిబ్బంది వాహనాలను అడ్డుకున్నారు. టైర్లలోని గాలి తీసి వాగ్వాదానికి దిగారు. అడ్డుకున్న సిబ్బందిపై కొందరు దాడికి కూడా పాల్పడ్డారు. ఏకంగా మూడు గంటల పాటు వారిని అక్కడ నుంచి కదలనివ్వని పరిస్థితి.తమపై దాడి చేసి, తమను అడ్డుకున్నారంటూ అటవీ శాఖ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో విజయపురి సౌత్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, తండా వాసులను చెదరగొట్టి అటవీ శాఖ సిబ్బందిని క్షేమంగా తీసుకొచ్చారు. అయితే, తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీ శాఖ సిబ్బంది స్వాధీనం చేసుకుంటున్నారు.

# బాధ్యతాయుత జర్నలిజమే ప్రజల విశ్వాసానికి పునాది

-వనపర్తి జిల్లా విలేకరుల పునశ్చరణ శిక్షణ ముగింపు.
-సమకాలీన జర్నలిజంపై నిపుణుల విలువైన సూచనలు.
-ధ్రువపత్రాలు అందజేసిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి



**వనపర్తి, సమయం ప్రతినిధి :** "మీ కలం కత్తి కంటే పదునైనది. సమాజానికి మేలు చేసే బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని అందించాలి. తెలంగాణ చరిత్రను వాస్తవాధారాలతో ప్రజల ముందుకు తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలి" అని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నాంపల్లిలో నిర్వహించిన వనపర్తి జిల్లా విలేకరుల రెండ్రోజుల పునశ్చరణ శిక్షణా కార్యక్రమం సోమవారం ముగింపు సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మారుతున్న మీడియా పరిస్థితులకు అనుగుణంగా జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని, ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుని ప్రజలకు విశ్వసనీయమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. శిక్షణలో సీనియర్ జర్నలిస్టు కె. శ్రీనివాస్ 'తెలంగాణ జర్నలిజం-గతం, వర్తమానం, భవిష్యత్తు' అంశంపై ప్రసంగిస్తూ డిజిటల్ యుగంలో జర్నలిస్టుల బాధ్యతలు, వృత్తి నైపుణ్యాల పెంపు అవసరాన్ని వివరించారు. ప్రముఖ పాత్రికేయుడు చిల్లా మల్లేశం వార్తా రచనలో శుద్ధమైన భాష, సరైన పదాల వినియోగం, భాషా ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించగా, సీనియర్ జర్నలిస్టు తోట భవానారాయణ గ్రామీణ సమస్యలను సమర్థవంతంగా ప్రజల ముందుకు తీసుకురావడంలో మీడియా పాత్రను విశ్లేషించారు. మీడియా నిపుణుడు రవితేజ మానవ అక్రమ రవాణా, బాలల వెట్టి చాకిరి నిర్మూలన వంటి సామాజిక అంశాలపై బాధ్యతాయుత వార్తా కథనాల అవసరాన్ని వివరించారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మీడియా చట్టాలు, నైతిక విలువలు, ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ చట్టం--2023, PRGI వ్యవస్థపై అవగాహన కల్పించారు. వాస్తవ నిర్ధారణ చేసిన సమాచారాన్నే ప్రచురించాలని, ఫేక్ న్యూస్, సోషల్ మీడియా ప్రభావం, కృత్రిమ మేధస్సు (AI) వినియోగం వంటి అంశాల్లో జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముగింపు కార్యక్రమంలో డా. జిల్లెల చిన్నారెడ్డి విలేకరులకు శిక్షణ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ శిక్షణ వృత్తి నైపుణ్యాల పెంపునకు ఎంతో ఉపయోగపడిందని పాల్గొన్న జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరావు, డీపీఆర్వో సీతారాం నాయక్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధు, సీనియర్ జర్నలిస్టులు, అధికారులు, వనపర్తి జిల్లా విలేకరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై దర్యాప్తు జరపాలి : రాష్ట్ర ఉపాధ్యక్షులు మాళోత్ శాంతికుమార్




మహబూబాబాద్, జూలై 21, సమయం ప్రతినిధి : నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, కుట్రలో ఉన్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాళోత్ శాంతికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమార్ మాట్లాడుతూ దేశంలో విద్య, ఉపాధి, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థుల గొంతును అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం దమనకాండకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కు అని, ఆ హక్కును లాఠీలతో అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. విద్యార్థులను అరెస్టు చేయడం, నిర్బంధించడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలని, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడికి బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అరెస్టు చేసిన విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలని, విద్యార్థి ఉద్యమాలపై దమనకాండను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసిందన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాజీవ్, మునేష్, వినోద్, పవన్, గౌతమ్, రవి, లోకేష్, సాయిరాం, కిరణ్ కుమార్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి




**వనపర్తి. సమయం ప్రతినిధి :** ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (CEO) పి. సుదర్శన్ రెడ్డి రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లాల్లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఎన్యుమరేషన్ ఫారంల డిజిటలైజేషన్ ఎంత శాతం పూర్తయిందని ఇంకా ఎంత మేర చేయాల్సి ఉందని దానిపై ఆరా తీశారు. మరో వారం రోజుల్లో 90 శాతానికి చేరుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అన్ని జిల్లాల అధికారులకు సూచించారు.వీసి అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. అందరూ తహసీల్దార్లు ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి, ఫారాల సేకరణ, ఆన్లైన్‌లో నమోదు, తదితర పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసిల్దార్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక గ్యాస్ట్రోఎంటరాలజీ సేవలు

డా. వినోద్ రెడ్డి రామన్, కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్




మహబూబాబాద్, జూలై 21, సమయం ప్రతినిధి : జీర్ణవ్యవస్థ, కాలేయం, పాంక్రియాస్, పిత్తాశయాలకు సంబంధించిన వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నట్లు కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా. వినోద్ రెడ్డి రామన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధరణి హాస్పిటల్ లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యశోద హాస్పిటల్స్‌లోని గ్యాస్ట్రోఎంటరాలజీ ఛ హెపటాలజీ విభాగంలో ఎండోస్కోపీ, ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్, ఈఎస్సీపీ వంటి ఆధునిక సాంకేతికతలతో పాటు అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపిక్ చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రారంభ దశలో గుర్తించే జీర్ణాశయ క్యాన్సర్లు, ప్రీ-క్యాన్సర్ గడ్డలను శస్త్రచికిత్స అవసరం లేకుండా ఎండోస్కోపిక్ సబ్‌మ్యూకోసల్ డిసెక్షన్, ద్వారా తొలగించే సదుపాయం అందుబాటులో ఉందన్నారు. అలాగే నోటి ద్వారా నిర్వహించే పెరోరల్ ఎండోస్కోపిక్ మయోటమీ, గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ వ్యాధి, చికిత్సకు యాంటీ-రిఫ్లక్స్ మ్యూకోసెక్టమీ వంటి అత్యాధునిక విధానాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సాధారణ ఎండోస్కోపీలో గుర్తించలేని చిన్నపేగు సమస్యల నిర్ధారణ కోసం క్యాప్సూల్ ఎండోస్కోపీ, బెలూన్ ఎంటెరోస్కోపీ సేవలు అందుబాటులో ఉన్నాయని, వీటి ద్వారా చిన్నపేగు రక్తస్రావం, పాలిప్స్ తదితర సంక్లిష్ట సమస్యలను గుర్తించి చికిత్స అందించవచ్చన్నారు. కాలేయ వైఫల్యం వంటి క్లిష్ట పరిస్థితులకు ప్లాస్మా ఎక్స్చేంజ్, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నామని, అలాగే పునరావృతమయ్యే క్లోస్ట్రిడియోయిడ్స్ డిఫిసైల్ ఇన్ఫెక్షన్లకు ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి ఆధునిక చికిత్సా విధానాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఫ్యాటీ లివర్, సిరోసిస్, ఇన్ఫ్లమేటరీ బవెల్ డిసీజ్, జీర్ణాశయ రక్తస్రావం, ప్యాంక్రియాటిక్, బిలియరీ వ్యాధుల నిర్వహణలో యశోద హాస్పిటల్స్ నిపుణుల బృందం విశేష అనుభవంతో సేవలు అందిస్తోందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత, నిపుణులైన వైద్యులు, బహుళ విభాగాల సమన్వయం, రోగి-కేంద్రిత వైద్య సేవలతో యశోద హాస్పిటల్స్ గ్యాస్ట్రోఎంటరాలజీ & హెపటాలజీ విభాగం ఉత్తమ వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ రాజు కుమార్, సుదర్శన్ రెడ్డి, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నీట్ వ్యవహారంపై కేంద్ర మంత్రిని తొలగించాలి



మహబూబాబాద్, జూలై 21, సమయం ప్రతినిధి : నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన వైఫల్యాలు, ప్రశ్నాపత్రం లీక్ ఘటనలతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు ఎంతో శ్రమించి, భారీ వ్యయంతో నీట్ పరీక్షకు సిద్ధమయ్యారని తెలిపారు. పరీక్ష రద్దు కావడంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారని, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గత రెండు నెలలుగా విద్యార్థులు, యువజన సంఘాలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని ఆయన విమర్శించారు. ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమాల సందర్భంగా విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం, భాష్పవాయు గోళాలు ప్రయోగించడం, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధమని అన్నారు.నీట్ పరీక్ష రద్దు కారణంగా 20 మంది విద్యార్థులు మరణించారని, వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలని, ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని బానోత్ దేవేందర్ హెచ్చరించారు.

## డిజిటల్ లూప్‌లో వైసీపీ - రాజకీయాల్లో రాత మారుతుందా?

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు సరికొత్త చర్చకు దారితీశాయి. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల పూర్తిగా డిజిటల్ పాలిటిక్స్ వైపే మొగ్గు చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. సొంత యాప్స్, టెక్నాలజీతో మన రాత మారిపోతుంది, కేడర్ అంతా డిజిటల్ వేదికలపై యాక్టివ్ కావాలి అని జగన్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం.. క్షేత్రస్థాయి రాజకీయాలను విస్మరించి క్యాడర్‌ను మభ్యపెట్టడమేనా అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల నుండి వస్తున్నాయి. కేవలం డిజిటల్ ప్రచారం, సొంత యాప్‌ల సృష్టి ద్వారా ఒక ప్రాంతీయ పార్టీ ప్రతిపక్ష హోదాలో ఎంతవరకు మైలేజ్ సాధించగలదనే అంశంపై భిన్నాభిప్రాయాలువ్యక్తమవుతున్నాయి. ఆధునిక రాజకీయాల్లో సోషల్ మీడియా, డిజిటల్ ప్రచారాల ప్రాధాన్యత పెరిగిన మాట వాస్తవమే. అయితే, వైఎస్సార్‌సీపీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఎక్స్‌టర్నల్ ప్లాట్‌ఫారమ్‌లలో వారి కంటెంట్‌కు ఆశించిన స్థాయిలో రీచ్ రాకపోవడం.

## ప్రజలకు పోలీసు సేవలందించాలి : జిల్లా ఎస్పీ డా. శబరీష్



మహబూబాబాద్, జూలై 21, సమయం ప్రతినిధి : ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పోలీసింగ్ నిర్వహిస్తూ, అనుభవాన్ని సమర్థవంతమైన కార్యాచరణగా మార్చి ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏబీ ఫంక్షన్స్ హాల్‌లో అన్ని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఏఎస్ఐలు)తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు పోలీస్ స్టేషన్ వ్యవస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తారని, తమ సీనియారిటీ, అనుభవాన్ని ప్రజా సేవకు వినియోగించి ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ప్రజలకు అవసరమైన సేవలు ఆలస్యం కాకుండా సమయపాలనతో వ్యవహరించాలన్నారు. విధుల నిర్వహణలో భావోద్వేగాలు, రాగద్వేషాలకు అతీతంగా చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా, సహనంతో, గౌరవప్రదంగా ప్రవర్తిస్తూ పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని, పోలీస్ స్టేషన్‌లో ప్రతి పని వ్యవస్థీకృతంగా జరిగేలా చూడాలని, అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయాన్ని పెంపొందించి టీమ్‌వర్క్‌తో పనిచేయాలన్నారు. స్మార్ట్ వర్క్, సమయ నిర్వహణ, వృత్తి నైపుణ్యాలతో పోలీస్ స్టేషన్ పనితీరును మరింత మెరుగుపర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ప్రజలకు న్యాయం, భరోసా అందించే కేంద్రంగా ఉండాలని, ప్రతి అధికారి బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావంతో విధులు నిర్వర్తిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్నారు.



# గ్రామదేవతలు ప్రజలకు రక్షణ కవచాలు





**బోనాలు మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. పెద్దమ్మ తల్లి బోనాల పండుగలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్న మాజీ మంత్రి జాతరలో నిరంజనుడి సందడి స్వీట్స్ పంచి భక్తులను ఉత్సాహపరచడం ప్రజలకు కనువిందు.**





వనపర్తి : గోపాల్ పేట మండల కేంద్రంలో అత్యంత వైభవంగా జరిగిన పెద్దమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బోనాలు ఎత్తుకున్న మహిళలకు స్వాగతం పలికి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆలయ మర్యాదలతో నిరంజన్ రెడ్డి ని ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామదేవతలు ప్రజలకు రక్షణ కవచాలుగా నిలుస్తారని బోనాలు మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి అవే భావితరాలకు ఆదర్శంగా నిలిచి భక్తిభావాలు పెరిగి సమాజములో సుఖసంతోషాలు కలుగుతాయని అన్నారు. పెద్దమ్మ తల్లి దయతో ఈ సంవత్సరం వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండి ప్రజలంతా సుభిక్షంగా ఆయురారోగ్యాలతో అష్టాయిశ్వర్యలతో ఉండేలా ఆశీర్వదించాలని నిరంజన్ రెడ్డి అమ్మ వారిని ప్రార్థించారు.

**జాతరలో నిరంజనుడి సందడి.**

పెద్దమ్మ పండుగ సందర్భంగా వెలసిన తినుబండారాల దుకాణాలను సందర్శించి వ్యాపారస్తులను ఆప్యాయంగా పలకరించి అక్కడి స్వీట్స్ తమ వెంట ఉన్న శ్రేణులకు,భక్తులకు పంచి కొద్దిసేపు సందడి చేశారు. నిరంజన్ రెడ్డి వెంట సర్పంచ్ కె.స్వప్న భాస్కర్,బి.బాలరాజు, రాజేష్ గౌడ్,ఎద్దుల.గోపాల్, వడ్డే.గోపాల్,మన్నే నాయక్,,మతీన్,బాబు మేస్త్రీ, తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిది (జులై 21): బిజినపల్లి మండలంలోని గ్రామాలలో గల పాఠశాలల్లో మంగళవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. రమేష్ కలిసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావలసిన 6 డి ఏ ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని పి. ఆర్. సి ని తక్షణమే ప్రకటించాలని కోరారు. ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ను రద్దు చేయాలని ఓ పి ఎస్ ను అమలుపరచాలని కోరారు . జిపిఎఫ్, మెడికల్ రీయంబర్స్మెంట్, సరెండర్ లీవ్ పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగర్కర్నూల్ జిల్లా ఆర్థిక కార్యదర్శి హనుమంత్ రెడ్డి బిజినపల్లి మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శేఖర్ వెంకటస్వామి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో కొత్తగా మరో 15 రిటైల్ మాల్స్..

హైదరాబాద్ : హైదరాబాద్‌లో రిటైల్ రంగానికి లభిస్తున్న ఆదరణతో మరో 15 కొత్త మాల్స్ ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం 30కి పైగా మాల్స్ ఉండగా.. కొత్తగా 6 గ్రేడ్–1, పలు గ్రేడ్–2 మాల్స్ జతకానున్నాయి. సంధ్య లులూ, ఫోరం మాల్, వంశీరామ్, బ్రూక్‌ఫీల్డ్ వంటి దిగ్గజ మాల్స్ రాబోతున్నాయి. కాగా, నిర్వహణ భారం, ఆధునిక పోటీ తట్టుకోలేక పాత మాల్స్ క్రమంగా ఆస్పత్రులు, కామర్షియల్ టవర్లుగా మారుతున్నాయి. మరోవైపు నగరంలోని అన్ని దిక్కులా మాల్స్ కల్చర్ విస్తరిస్తున్నట్లు అనరాక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.హైదరాబాద్ మహానగరంలో రిటైల్ రంగం శరవేగంగా విస్తరిస్తోంది. మాల్స్ సంస్కృతి నగరంలో కొత్త శిఖరాలకు చేరుకుంటోంది. తాజాగా అందిన వివరాల ప్రకారం.. ఈ సంవత్సరాంతానికి లేదా వచ్చే ఏడాది నాటికి గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా కొత్తగా మరో 15 మాల్స్ ప్రారంభం కానున్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే నగరంలో చిన్నవి, పెద్దవి కలిపి 30కి పైగా మాల్స్ అందుబాటులో ఉన్నాయి. దేశంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి అని అనరాక్ వంటి ప్రముఖ రియల్ ఎస్టేట్ పరిశోధనా సంస్థలు వెల్లడిస్తున్నాయి.ఒకప్పుడు కేవలం సెంట్రల్ హైదరాబాద్ ప్రాంతానికే పరిమితమైన మాల్స్, ఇప్పుడు నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్ అంటూ నగర నలుమూలలకూ విస్తరించాయి. కొత్తగా రాబోతున్న వాటిలో ఆరు మాల్స్ గ్రేడ్–1 కేటగిరీకి చెందినవిగా ఉండనున్నాయి. దీంతో నగరంలో గ్రేడ్–1 మాల్స్ సంఖ్య 9 నుంచి 15కి చేరనుంది. మరోవైపు.. కొత్తగా అత్యాధునిక మాల్స్ రూపుదిద్దుకుంటుండటంతో పాత మాల్స్ నిర్వహణ తీవ్ర భారంగా మారి తెరమరుగయ్యే పరిస్థితి నెలకొంది. కొన్ని పాత మాల్స్ ఇప్పటికే ఆస్పత్రులుగా, వాణిజ్య సముదాయాలుగా రూపాంతరం చెందుతుండగా.. మరికొన్ని మాల్స్ నిర్మాణ దశలోనే ఇతర వాణిజ్య సంస్థలుగా మారిపోతున్నాయి.నగరంలో రాబోతున్న ప్రధాన గ్రేడ్–1 మాల్స్ చూసినట్లయితే.. నార్సింగి వద్ద దేశంలోనే అతిపెద్ద మాల్స్‌లో ఒకటిగా సంధ్య లులూ మాల్ రానుంది. రాజేంద్రనగర్‌లోని ప్రెస్టీజ్ సిటీలో దాదాపు 12 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫోరం మాల్ నిర్మితమవుతోంది. గచ్చిబౌలి పరిసరాల్లో యూనిటీ మాల్, నార్సింగి వద్ద లగ్జరీ మాల్‌గా వంశీరామ్ మాల్, కోకాపేట వద్ద ఏరియా బై ఫెయిర్‌మౌంట్, కర్మాన్‌ఘాట్ వద్ద కొలీసియం మాల్ రూపుదిద్దుకుంటున్నాయి. వీటితో పాటు నానక్‌రామ్‌గూడ వద్ద ఎస్ఏఎస్ ఐ–టవర్స్ రిటైల్, రాయదుర్గంలో బ్రూక్‌ఫీల్డ్ కే రహేజా కార్ప్ మాల్, డౌన్ టౌన్ మాల్స్ అందుబాటులోకి రానున్నాయి.వీటితో పాటు మీడియం అండ్ కమ్యూనిటీ కేటగిరీ కింద రాబోతున్న గ్రేడ్–2 మాల్స్ నగరంలో రీజినల్ రిటైల్ అవసరాలను తీర్చనున్నాయి. హస్తినాపురంలో హెచ్ఎస్ఆర్ ఆర్క్ మాల్, మణికొండలో రామిరెడ్డి మాల్, బాలానగర్‌లో స్టార్ లైట్ మాల్, బండ్లగూడ పరిసరాల్లో టాప్రూ మాల్ నిర్మాణంలో ఉన్నాయి. ఆధునిక సౌకర్యాలు, విశాలమైన పార్కింగ్, అంతర్జాతీయ బ్రాండ్లతో వస్తున్న ఈ కొత్త మాల్స్ రాకతో హైదరాబాద్ రిటైల్ మార్కెట్ స్వరూపమే మారిపోనుంది.

## ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి



సంగారెడ్డి, జూలై 21: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎలక్ట్రోరల్ రోల్‌ను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా రూపొందించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే భారత ఎన్నికల సంఘం లక్ష్యమని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నందున, నిర్ణీత గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లాలో ఎస్ఐఆర్ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు సగటున 70 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా నారాయణఖేడ్‌లో 85 శాతం, అందోల్‌లో 80 శాతం, జహీరాబాద్‌లో 75 శాతం, సంగారెడ్డిలో 71 శాతం, పటాన్‌చెరులో 52 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. పటాన్‌చెరు నియోజక వర్గంలో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో మాట్లాడుతూ, అన్ని నియోజకవర్గాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో వార్డు అధికారులు, ఇతర వాలంటీర్ల సహకారంతో ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.అలాగే పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని, వలస వెళ్లిన వారు, మృతి చెందిన వారు, డబుల్ ఓటర్లు వంటి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధృవీకరించి, తప్పులు లేని పారదర్శక ఓటరు జాబితాను రూపొందించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి - సిజెపి పై నిర్బంధాన్ని ఎత్తివేయాలి



**(సమయం ప్రతినిధి):** సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పెబ్బేరు మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి గోపాల్, రాష్ట్ర రైతు సంఘం నాయకులు మొగులయ్య లు మాట్లాడుతూ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని జులై(రేపు) 22వ తేదీన జరిగే నిరసనలు రైతులు రైతు కూలీలు పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని జ్ఞప్తి చేస్తున్నాము. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీ కేంద్రంలోని జంతర్ మంతర్ దగ్గర నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. నీటు పవర్ లీకేజీ, సీబీఎస్సీ అక్రమాలు విద్యావ్యవస్థలో మార్పులు చేయాలని కోరుతూ సిజేపి ఆధ్వర్యంలో ఢిల్లీలో నిరసనలు సాగుతున్నాయి.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ సోనం వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షను భగ్నం చేయాలని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేసి మొన్న రాత్రి సోనం వాంగ్ చుక్ తీసుకుపోయి హాస్పిటల్లో అడ్మిట్ చేశారు.దేశంలో ప్రతి పౌరునికి నిరసన చేసే హక్కు ఉంటుంది.కానీ 2014లో బిజెపి కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడికక్కడ రైతాంగాన్ని, విద్యార్థులు, యువకులను నిరసన చేస్తే అక్రమ అరెస్టులు చేస్తున్నారు. ఇందులో భాగంగా నీట్ పేపర్ లీకేజీ. సీబీఎస్సీ అక్రమాలకు నిరసనగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిజేపి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగుతున్నది. ఈ పార్లమెంటు సమావేశాల సందర్భంగా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ పార్లమెంటుకు శాంతియుతంగా ర్యాలీ చేయాలని సీజేపి పార్టీ నిర్ణయించినది. ఈ క్రమంలో సిజేపి పార్టీ దేశ అధ్యక్షులు అభిజిత్ దీప్కేను అరెస్టు చేశారు మరియు సోనాం వాంగ్ చుక్ నిర్బంధించారు. కనుక వెంటనే అభిజిత్ దిక్కేను విడుదల చేసి, సోనం వాంగ్చుక్ పై నిర్బంధం ఎత్తివేయాలని, ఎస్ కె ఎం కరపత్రాలను విడుదల చేస్తూ ఈ సమావేశం డిమాండ్ చేస్తున్నది. ఈ కార్యక్రమంలో ఎస్ కే యం నాయకులు రాష్ట్ర రైతు సంఘం మొగులన్న, గంధం మొగులయ్య, నాగన్న రాముడు, రాజు, గాంధీ ఎల్ల స్వామి, బుచ్చన్న తదితర రైతులు పాల్గొన్నారు.

## ఫలించిన 22 ఏళ్ల పోరాటం

మెదక్ : ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసిత రైతుల 22 ఏళ్ల పోరాటం ఫలించింది. కందుకూరు మండలం లేమూరులోని సర్వే నంబర్ 102లో అభివృద్ధి చేసిన ప్లాట్లను కేటాయించేందుకు రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు అంగీకరించారు. ఆరుగురు సీఎంలకు విన్నవించి, ఇటీవల మూడు నెలల పాటు దీక్షలు చేసిన రైతుల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మార్గం సుగమమైంది. ఈ మేరకు 23 మంది సీలింగ్ పట్టాదారులకు 325 చ.గజాలు, కాస్తులో ఉన్న 148 మందికి 200 చ.గజాల చొప్పున ప్లాట్లు దక్కనున్నాయి. అయితే 38ఈ పట్టాదారుల సమస్య పరిష్కారం కావాల్సి ఉంది.ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసితుల సుదీర్ఘ పోరాటం ఎట్టకేలకు 22 సంవత్సరాల తర్వాత ఫలించింది. నిర్వాసిత రైతులకు రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం లేమూరులో ప్లాట్లు కేటాయించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జీహెచ్ఎంసీ పరిధిలోని తుక్కుగూడ డివిజన్ పరిధిలోని రావిర్యాల, జెన్నాయిగూడ గ్రామాల్లో మొత్తం 730.17 ఎకరాల భూమిని 2003–04లో అప్పటి ప్రభుత్వం ఏపీఐఐసీ కోసం సేకరించింది. ఇందులో కొండలు, గుట్టలు ఉన్న ప్రాంతాన్ని మినహాయించి.. మిగిలిన 679.13 ఎకరాలకు పరిహారంగా జెన్నాయిగూడ వద్ద 35 ఎకరాలను అభివృద్ధి చేసి ప్లాట్ల రూపంలో కేటాయిస్తామని అప్పట్లో ప్రతిపాదించారు. అయితే.. ఆ సమయంలో కేటాయించిన ప్యాకేజీకి 38ఈ పట్టా రైతులు అంగీకరించకపోవడంతో కేటాయింపు ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వాలు మారడంతో బాధితులకు న్యాయం జరగలేదు.ఈ సమస్య పరిష్కారం కోసం భూనిర్వాసిత రైతులు గత 22 ఏళ్లుగా విరామం లేకుండా పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి నేటి వరకు దాదాపు ఆరుగురు ముఖ్యమంత్రుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. 2003లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబును, 2006లో వైఎస్ రాజశేఖరరెడ్డిని కలిశారు. ఆ తర్వాత కొణిజేటి రోశయ్య, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలకు వినతిపత్రాలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ విషయాన్ని కేసీఆర్, కేటీఆర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టే సమయంలో మళ్లీ ప్రభుత్వం మారింది. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు గత మూడు నెలలుగా రిలే నిరాహారదీక్షలు చేపట్టడం గమనార్హం.

# SIR పై సమీక్ష సమావేశం నిర్వహించిన దేవరకద్ర ఎమ్మెల్యే





(సమయం ప్రతినిధి దేవరకద్ర) : దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చిన్నచింతకుంట, కౌకుంట్ల, దేవరకద్ర మండలాల దీూా లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్లు, మండల మరియు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులతో ఎస్ఐఆర్ పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎవరు కదరా ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొని 100 శాతం SIR పూర్తయిన బూత్ లకు సంబంధించిన దీూా లను సన్మానించారు. ఎస్ఐఆర్ పక్రియ 100% పూర్తయ్యేలా ప్రతి బిఎల్ఎ కృషి చేయాలని, షిఫ్టెడ్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ కోరారు. 3వ తేదీ వరకు ఎస్ ఐ ఆర్ గడువున్నప్పటికీ, ఈనెల 25వ తేదీనే SIR డెడ్లైన్ గా భావించి, ప్రతి బూత్ లో 100% ఎస్ఐఆర్ పక్రియ పూర్తిచేయాలని కోరారు. బిఎల్ఎ లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ పాలకులు, మళ్లీ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని, ఎన్ని పగటి కలలు కన్నా బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదని ఫైర్ అయ్యారు. స్వయానా మాజీ ముఖ్యమంత్రి కూతురు కవిత బీఆర్ఎస్ ఈ జన్మలో అధికారంలోకి వచ్చేది లేదని చెప్పిన విషయాన్ని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తుకు చేశారు. పార్టీ కార్యక్రమాలలో కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని, ప్రభుత్వంపై బిఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పి కొట్టాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరిని గుర్తుంచుకొని, వరుస క్రమంలో అవకాశాలు ఇస్తామని, కష్టపడ్డ ప్రతి ఒక్కరికి అవకాశాలు కల్పించే బాధ్యత నాదని ఈ సందర్భంగా నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. బిఆర్ఎస్ పార్టీ యూట్యూబ్ ఛానల్ లు పెట్టుకుని ఎంత దుష్ప్రచారం చేసిన ప్రజలు బిఆర్ఎస్ ను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో దేవరకద్ర నియోజకవర్గంలో గెలిచి, రెండో సారి దేవరకద్ర గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తమని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 14 కు 14 సీట్లను కైవసం చేసుకుంటామని, ముఖ్యమంత్రి . రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండోసారి అధికారంలోకి వస్తామని, 2034 వరకు ఇక్కడ అధికారంలో ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే జియంఆర్ ధీమా వ్యక్తం చేశారు.




## ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నంకి రాష్ట్ర మంత్రి హోదా



(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విప్‌లు అయిన యెన్నం శ్రీనివాస్ రెడ్డి , శ్రీ చింతకుంట విజయ రమణ రావు , వేముల వీరేశం కి రాష్ట్ర మంత్రి (Minister of State) హోదాను కల్పిస్తూ G.O.Rt.No.1064 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ విప్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి రాష్ట్ర మంత్రి హోదా కల్పించడం పట్ల మహబూబ్‌నగర్ నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, స్టేట్ వారెంట్ ఆఫ్ ప్రిసిడెన్స్‌లోని ఆర్టికల్-18 ప్రకారం రాష్ట్ర మంత్రి హోదాకు సంబంధించిన అన్ని అధికారిక ప్రోటోకాల్‌లు, మర్యాదలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి వర్తిస్తాయి. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, శాసనసభలో ప్రభుత్వ తరఫున సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్న యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి రాష్ట్ర మంత్రి హోదా కల్పించడం ఆయన సేవలకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపుగా భావిస్తున్నారు.

## ప్రతి గ్రామంలో భీమ్ ఆర్మీ సైనికులను తయారు చేయాలి

### ఘనంగా భీమ్ ఆర్మీ 11వ, సంవత్సర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




గద్వాల : జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్ర కార్యాలయంలో భీమ్ ఆర్మీ 11వ, సంవత్సర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా భీమ్ ఆర్మీ, జిల్లా అధ్యక్షులు మెలచెరువు వర్షిత్, జిల్లా అధ్యక్షులు లిఉమ్మడి జిల్లా మాచర్ల ప్రకాష్ గారి ఆధ్వర్యంలో ఎస్సి, ఎస్టీ, బీసీ మైనార్టీ మరియు ఆనాగరిన వర్గాల ప్రజలకు ఎలాంటి అన్యాయం జరిగిన నాయ్యం జరిగే వరకు ముందుండి పోరాడే సంస్థ అని పిలునివ్వడం జరిగింది. భీమ్ ఆర్మీ నాయకులు కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి స్విట్లు పంచి విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ జిల్లా కోశాధికారి విజయ్‌లిభీమ్ ఆర్మీ వర్కింగ్ ఆర్గనైజర్ లిసుందర్ రాజు, నాగన్న,ఎండీ జూనైద్, ప్రభాకర్, అభిషేక్, మనోహర్ జనార్దన్, కరుణాకర్, అశోక్, రాజశేఖర్, ఆశీర్వాదం,ఫయాజ్ రవి రామకృష్ణ.వీరేష్. తదితరులు పాల్గొనడం జరిగింది.

## అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన



అమరచింత: ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీ చార్జిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం అమరశింత లోని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టారు, ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి రవీందర్ మాట్లాడుతూ నీట్ ప్రశ్న పత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు, తక్షణమే ప్రధాని నరేంద్ర మోడీ స్పందించి విద్యామంత్రిని రాజీనామా చేయించాలని ఆయన కోరారు శాంతియుతంగా విద్యార్థులు నిరసన తెలుపుతుంటే ఢిల్లీ పోలీసులు అమానుషంగా లాటి చార్జి చేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు, ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ నాయకులు భాస్కర్ రవీందర్ శ్యాంసుందర్ లక్ష్మీనారాయణ ఎర్రన్న ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## మన ఓటు....మన బాధ్యత.

## ఓటు పరిరక్షణలో బి.ఎల్. ఏలు కీలకంగా వ్యవహరించాలి మాజీ మంత్రి




వనపర్తి : SIR సర్ ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని వనపర్తి మండలం అంజని గిరి వెంకటాపూర్ అంకూర్ పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి, దొడగుంటపల్లి, ముందరి తండా, చీకురు చెట్టు తండా, స్కూల్ తండా గట్ల ఖానాపూర్ గోపాల్ పేట్ మండలంలో మున్ననూరు, చెన్నూరు ,తాడిపర్తి , తిరుమలాపూర్ గ్రామాలలో లిమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పర్యవేక్షించి బి.ఎల్.ఓ మరియు బి.ఎల్.ఏ ప్రజా ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఓటు కాపాడుకునే బాధ్యత మనది అని ప్రతి , ఓటరుకు బిఎల్ఓ లను సంబంధిత అధికారులను బి.ఆర్.ఎస్ పార్టీ బి.ఎల్.ఏలు ప్రత్యక్షంగా కలసి సమాచారం ఇచ్చి సర్ ప్రక్రియలో పాల్గొనే విధంగా అప్రమత్తం చేయాలని అన్నారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు మాణిక్యం. రఘు వర్ధన్ రెడ్డి, మాధవరెడ్డి, రవి ప్రకాష్ రెడ్డి దేగ మహేశ్వర్ రెడ్డి, నరేష్ చిట్యాల రాము, పెద్దమందడి మండలం జగదీశ్వర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, రవీందర్ రావు, లక్ష్మణ్ గౌడ్ ,శంకర్ నాయక్, రమేష్ హనుమంతు, శ్రీనివాస్ రెడ్డి గోపాల్ పేట్ మండలం తిరుపతయ్య పాల్గొన్నారు.

## బీఎల్ఏల అత్యవసర సమావేశం పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం...!




అలంపూర్ : అలంపూర్ మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ ఆదేశాల మేరకు ఎర్రవల్లి మండల కేంద్రంలో బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ హాజరై మాట్లాడారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ...!పార్టీ సంస్థాగత బలోపేతంలో బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఓటరు జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే, పార్టీ అధిష్ఠానం ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కాంగ్రెస్ పార్టీని మరింత ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. అలంపూర్ నియోజకవర్గంలో డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జోగులాంబ గద్వాల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ మధు నాయుడు ఎర్రవల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు, ఆనంద్ ఉమాపతి నాయుడు .శ్రీనివాసరెడ్డి . అలాబకస్. హుస్సేన్.జయన్నా, బిసిరెడ్డి, అంజి, వెంకటన్న, రాజన్న, యువరాజ్, భాస్కర్ జయరాముడు, తిరుపతి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ SIR ప్రక్రియలో పాల్గొనాలి



హైదరాబాద్, జూలై 21 (సమయం ప్రతినిధి): ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న SIR కార్యక్రమంలో భాగంగా బోరబండ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎస్. ఆనంద్, నగర సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాసుల మహేష్ గౌడ్ మంగళవారం బోరబండ పరిధిలోని పలు బస్తీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసుల మహేష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవడానికి SIR ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని అవసరమైన దరఖాస్తు ఫారాలు నింపాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు తొలగిపోకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే అత్యంత శక్తివంతమైన ఆయుధమని అన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, ఎవరి ఓటు కూడా వృథా కాకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోరబండ డివిజన్ అధ్యక్షుడు ఎస్. ఆనంద్‌తో పాటు సరళ, లక్ష్మి నాయక్, సుభాని, మున్ని, మహబూబ్ బి, బాలరాజు, భాస్కర్, టీం సభ్యులు, బీఎల్ఓలు సంతోషిమాత, సురేఖ, సునీత, ఎక్బసుబా, స్వప్న, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మారుతి కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ రాబోతోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా వార్తలు చక్కర్లు కొట్టాయి. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో హారర్–కామెడీ డ్రామాగా తెరకెక్కించిన రాజా సాబ్ సినిమా తర్వాత మారుతి నెక్స్ట్ ప్రాజెక్ట్ ఎవరితో ఉంటుందనే ఉత్కంఠ నెలకొంది. ఆ సినిమా ఇచ్చిన రిజల్ట్ తో కొన్ని నెలలు బయట ఎక్కడా కనిపించని మారుతి.. ప్రస్తుతం ఒక కొత్త స్క్రిప్ట్ ని రెడీ చేసే పనిలో ఉన్నాడట. ఈ క్రమంలోనే మారుతి మార్క్ వినోదంతో వరుణ్ తేజ్ హీరోగా ఒక సినిమా ప్లాన్ చేస్తున్నారనే ప్రచారం మెగా అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తించింది. అయితే, తాజాగా వస్తున్న సమాచారం ప్రకారం ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తెలుస్తోంది. వరుణ్ తేజ్ – మారుతి కాంబోలో సినిమా రాబోతోందనేది కేవలం ఒక పుకారు మాత్రమేనని సినీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం వరుణ్ తేజ్ దర్శకుడు మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన కొరియన్ కనకరాజు సినిమాతో బిజీగా ఉన్నాడు. మరోవైపు మారుతి కూడా తన తదుపరి స్క్రిప్ట్‌పై దృష్టి సారించారు తప్ప, వీరిద్దరి మధ్య ఎలాంటి కథా చర్చలు జరగలేదని సమాచారం. ఇక ఈ రకంగా ఇద్దరూ తమ తమ సరికొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో, సోషల్ మీడియాలో వస్తున్న కాంబినేషన్ వార్తలు కేవలం ఊహాగానాలకే పరిమితమని తెలుస్తోంది. మారుతి మాత్రం రాజాసాబ్ ని ప్రేక్షకులు మర్చిపోయేలా చేసే కథ కోసం కష్టపడుతున్నట్లు సమాచారం. మరి మారుతికి అంతా మంచి హిట్ ఇచ్చే హీరో ఎవరు.. ? అనేది తెలియాలంటే ఆయన తదుపరి చిత్రం అధికారికంగా ప్రకటించేవారకు ఆగాల్సిందే.




ఒక నటుడికి ఇండస్ట్రీలో విజయం దక్కడం అంటే కేవలం వసూళు రావడం మాత్రమే కాదు, అది నిర్మాతుల్లో భరోసాను, దర్శకుల్లో నమ్మకాన్ని, ప్రేక్షకుల్లో విపరీతమైన ఉత్సాహాన్ని నింపుతుంది. లెనిన్ సినిమా ఘనవిజయంతో అఖిల్ అక్కినేని సరిగ్గా అలాంటి స్థితిలోనే ఉన్నారు చెప్పాలి. ఇండస్ట్రీలోకి వచ్చి 10 ఏళ్లు అయినా ఒక సరైన సక్సెస్ కోసం, తన సత్తా నిరూపించుకునే అవకాశం కోసం ఎదురుచూస్తున్న అఖిల్‌కు 'లెనిన్' రూపంలో ఆ డ్రీమ్ బ్రేక్‌త్రూ లభించింది. వెండితెరపై ఆయన చూపించిన నటన, తెచ్చిపెట్టిన ఆ క్రేజ్ బాక్సాఫీస్ దగ్గర సరికొత్త సంచలనం సృష్టించింది. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్ గా నటించింది. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై కింగ్ నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించారు.లెనిన్' సాధించిన విజయం కేవలం బాక్సాఫీస్ బొమ్మ మాత్రమే కాదు... తన కెరీర్ అంతటా అఖిల్ వెతుకుతున్న ఆత్మవిశ్వాసాన్ని అతనికి అందించింది. నిన్నటివరకు "గత సినిమాలు ఎందుకు ఆడలేదు? ఎక్కడ పొరపాటు జరిగింది?" అన్న చర్చలు నడిస్తే... ఇప్పుడు అఖిల్ తదుపరి ప్రాజెక్ట్ ఏంటి? తర్వాత రాబోయే వేట ఎలాంటిది? అనే ఆసక్తి అందరిలోనూ మొదలైంది. టాలీవుడ్ విశ్లేషకుల నుంచి సామాన్య అభిమానుల వరకు అందరి దృష్టి ఇప్పుడు అఖిల్ పైనే ఉంది.అయితే ఒక్క హిట్ కొట్టడం ఒకెత్తయితే... ఆ సక్సెస్ జోరును, ఆ ఊపును అలాగే కాపాడుకోవడం మరో పెద్ద సవాలు. ఈ భారీ విజయం తర్వాత ఇండస్ట్రీలోని పెద్ద పెద్ద మేకర్స్, టాప్ డైరెక్టర్లు మరింత ప్రతిష్టాత్మకమైన కథలతో అఖిల్‌ను సమీపించే అవకాశం ఉంది. ఈ సమయంలో తొందరపడి కథలు ఒప్పేసుకోకుండా, తనకు సరిగ్గా సరిపోయే డిఫరెంట్ కాన్సెప్ట్‌లను ఎంచుకోవడం చాలా ముఖ్యమని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఒక్క చిన్న తప్పుడు నిర్ణయం హిట్ కి బ్రేక్ వేయవచ్చు. అదే సరైన ఎంపికైతే ఇండస్ట్రీలోని స్టార్ హీరోల సరసన అతన్ని స్థిరంగా నిలబెడుతుందని అంటున్నారు. మరోవైపు ఇప్పుడు అందరి కళ్లూ అఖిల్ రాబోయే సినిమాల పైనే ఉన్నాయి. ఈ సక్సెస్ ఇచ్చిన బూస్ట్‌తో అఖిల్ ఎలాంటి కథలను ఎంచుకోబోతున్నాడు? తన మాస్, క్లాస్ అప్పీల్‌ను ఏ స్థాయిలో చూపించబోతున్నాడు అనేది ఆసక్తికరంగా మారింది. మరి 'లెనిన్' కేవలం ఒక విజయవంతమైన సినిమాగా మిగిలిపోతుందా? లేక అఖిల్ కెరీర్‌ను మలుపు తిప్పి, ఆయనను స్టార్‌డమ్ వైపు నడిపించిన తిరుగులేని ల్యాండ్‌మార్క్‌గా నిలుస్తుందా అనేది చూడాలి.




యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్ ఇండియా చిత్రం గాడ్ ఆఫ్ వార్ తెరకెక్కుతున్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'అరవింద సమేత వీరరాఘవ' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఈ ద్వయం మళ్లీ చేతులు కలపడం అభిమానుల్లో అంచనాలను ఆకాశానికి చేర్చింది. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్‌కు సోషల్ మీడియాలో విశేష స్పందన లభించింది. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన ఒక వార్త నెట్టింట జోరుగా వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా బాలీవుడ్ భామ కియారా అద్వానీ పేరును పరిశీలిస్తున్నట్లు దాదాపు ఖరారు అయినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన రానప్పటికీ, కథలో కీలకమైన మహిళా పాత్రకు ఆమె సరిగ్గా సరిపోతారని మేకర్స్ భావిస్తున్నారట. పురాణ గాథల స్ఫూర్తితో రూపొందుతున్న ఈ మైథలాజికల్ యాక్షన్ డ్రామాలో ఎన్టీఆర్ శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. 'వార్ 2' చిత్రంలో వీరిద్దరూ నటించినా, కియారా హృతిక్ రోషన్‌కు జోడీగా చేయడంతో.. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో ఎంపికైతే ఎన్టీఆర్ సరసన పూర్తిస్థాయి హీరోయిన్‌గా కనిపించే అవకాశం దక్కుతుంది. యారా తెలుగులో ఇదివరకు మహేష్ బాబు సరసన 'భరత్ అనే నేను' చిత్రంలో నటించి ఘన విజయం అందుకుంది. అయితే రామ్ చరణ్‌తో చేసిన 'వినయ విధేయ రామ', 'గేమ్ ఛేంజర్' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను సాధించలేకపోయాయి. దాంతో కొందరు అభిమానులు ఈ సెంటిమెంట్‌ను ప్రస్తావిస్తూ సోషల్ మీడియా వేదికగా చర్చలు జరుపుతున్నారు.

## Cinema




చిత్రసీమలో ఏ చిన్న సంఘటన జరిగినా... దాన్ని సెంటిమెంట్స్ కు ముడిపెట్టడమనేది సర్వసాధారణం. తాజాగా నందమూరి బాలకృష్ణకు సినిమా షూటింగ్‌లో యాక్సిడెంట్ జరిగిన నేపథ్యంలో గతంలో బాలకృష్ణ ఏ చిత్రంలో నటిస్తుండగా యాక్సిడెంట్ అయ్యింది? ఆ సినిమాల ఫలితాలు ఎలా ఉన్నాయనే చర్చ మొదలైంది. బాలకృష్ణకు తొలిసారి షూటింగ్‌లో యాక్సిడెంట్ కు గురైంది 1985లో. జంధ్యాల దర్శకత్వంలో తెరకెక్కిన ఆ సినిమాలో సుత్తి వీరభద్రరావు, బాలకృష్ణ 'బాబాయ్ – అబ్బాయ్'గా నటించారు. ఇందులో హీరోయిన్ గా నటించిన అనితా రెడ్డి కారును డ్రైవ్ చేస్తూ హీరోకు డ్యాష్ ఇచ్చే సీన్ లో నిజంగానే బాలకృష్ణ గుద్దేసింది. ఆ సమయంలో ఆయన నడుముకు గాయమైంది. ఈ సినిమా కమర్షియల్ గా ఆడలేదు. అదే సంవత్సరం వచ్చిన 'భార్యాభర్తల బంధం' సినిమా షూటింగ్‌లోనూ బాలకృష్ణకు దెబ్బ తగిలింది. ప్రముఖ దర్శక నిర్మాత వీబీ రాజేంద్ర ప్రసాద్ ఈ సినిమాను తెరకెక్కించారు. ఇందులో బాలకృష్ణ సరసన రజని హీరోయిన్ గా నటించింది. ఇందులోని ఓ పోరాట సన్నివేశంలో నటిస్తుండగా మోకాలుకు బలమైన గాయమైంది. అప్పుడు దానిని పట్టించుకోకపోవడంతో ఆ తర్వాత రోజుల్లో బాలకృష్ణ బాగా ఇబ్బంది పడ్డారు. 'భార్యాభర్తల బంధం' సినిమా ఓ మోస్తరుగా ఆడింది. ఇక మూడోసారి 2004లో 'విజయేంద్ర వర్మ' సినిమా షూటింగ్‌లో బాలకృష్ణ కాలుకు పెద్ద ప్రమాదం జరిగింది. దాంతో కొన్ని రోజులు బెడ్ రెస్ట్ తీసుకోవాల్సి వచ్చింది. స్వర్ణ సుబ్బారావు తెరకెక్కించిన ఈ సినిమా పరాజయం పాలైంది. అలానే బాలకృష్ణ 'లయన్' సినిమా షూటింగ్‌లోనూ ప్రమాదానికి గురయ్యారు. అప్పుడు కూడా కాలుకే గాయమైంది. 2015లో వచ్చిన ఈ సినిమాకు సత్యదేవ్ దర్శకుడు. ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. ఇలా బాలకృష్ణ ప్రమాదానికి గురైన ఈ సినిమా కూడా ఇంతవరకూ హిట్ అయిన దాఖలాలు లేవు. మరి ఇప్పుడు బాలకృష్ణ, మలినేని గోపీచంద్ కాంబోలో రాబోతున్న ఈ సినిమా ఆ సెంటిమెంట్స్ కు ఫుల్ స్టాప్ పెట్టి హిట్ అవుతుందేమో చూడాలి. బాలకృష్ణ యాక్సిడెంట్స్ కథ ఇలా ఉంటే... ఆయన తండ్రి, మహా నటుడు ఎన్టీఆర్ కు యాక్సిడెంట్స్ అయిన సినిమాలన్నీ ఘన విజయాన్ని సాధించడం విశేషం. కెరీర్ ప్రారంభంలోనే ఎన్టీఆర్ 'పల్లెటూరి పిల్ల' సినిమా షూటింగ్ ఎద్దు పొడవడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆ గాయం ఆయన ముఖంపై మాయనిమచ్చగా మిగిలిపోయింది. అలానే ఆ తర్వాత 'లక్ష్మీ కటాక్షం' సినిమా సమయంలోనూ ఎన్టీఆర్ కు గాయం అయ్యింది. ఇక 'దీక్ష' సినిమా షూటింగ్ టైమ్‌లో ఆయన్ని పాము కరిచింది. దాసరి దర్శకత్వం వహించిన 'సర్దార్ పాపారాయుడు' షూటింగ్ సమయంలోనూ ఎన్టీఆర్ తీవ్రంగా గాయపడ్డారు. చిత్రం ఏమంటే... 'దీక్ష' ఓ మాదిరిగా ఆడగా, మిగిలిన సినిమాలన్నీ కూడా సూపర్ హిట్ అయ్యాయి. ఆ రకంగా షూటింగ్‌లో యాక్సిడెంట్ అనేది ఎన్టీఆర్ కు కలిసివస్తే, బాలకృష్ణకు మాత్రం కలిసి రాలేదు.






OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085